క్లుప్తంగా

శాంతినగర్‌లో ఎంవీవీ పర్యటన



కార్యకర్తలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి శాంతినగర్‌లలో వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ శనివారం పర్యటించారు. ఆయన గడపగడపకు వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకొన్నారు. అనంతరం శాంతినగర్‌లో కె.రాజువర్మ నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎంఈవీ సత్యనారాయణ సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన ర్యాలీ



గాంధీనగర్‌లో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆరిలోవ: క్షయ వ్యాధి వారోత్సవాలులో భాగంగా శనివారం టీబీ విభాగం సిబ్బంది జీవీఎంసీ 11వ వార్డు పరిధి గాంధీనగర్‌లో అవగాహన ర్యాలీ చేపట్టారు. బాలాజీనగర్ యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఎ.ఎన్.ఎంలు, ఆశావర్కర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్ లలితాకుమారి మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధికి సంబంధించిన ఎలాంటి లక్షణాలు బయటపడినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే అందుబాటులో ఉన్న వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈనెల 24న జరగనున్న టీబీ దినోత్సవం సందర్భంగా వారం పాటు దీనిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి

విశాఖ సిటీ: భాషా ప్రయుక్త ప్రత్యేక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం ఉదయం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, సీఏఓ హరి ప్రసాద్, ఎస్ఈ బల రామరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



గణేష్ మృతదేహం

ఎంవీపీకాలనీ: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భానునగర్‌కు చెందిన చల్లపల్లి గణేష్ (23) పదో తరగతి వరకు చదువుకొని ప్రస్తుతం నగరంలోని ఓ కాలేజ్‌లో వాషర్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. తల్లిదండ్రులు వచ్చి చూడగా విగతజీవిగా కనిపించాడు. దీంతో గణేష్ తండ్రి అప్పారావు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

- తూర్పు నియోజకవర్గ అభ్యర్థి,ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



ఎంవీవీపై పూలవర్షం కురిపిస్తున్న అభిమానులు



సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ విజయం కోసం కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ పదో వార్డు పరిధి ఎస్.ఐ.జి నగర్‌లో ఓ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం కార్యకర్తలతో సిద్ధం సభ నిర్వహించారు. ఈ సభలో అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ఎంవీవీకి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. నియోజకవర్గంలో విజయకేతనం ఎగురవేసేందుకు అంతా సమష్టిగా పనిచేయాలని కోరారు. ఐదేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి పేద, మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారన్నారు. ఆయన పాలనపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. పేదలకు మేలు జరగడం వారికి ఇష్టంలేదన్నారు. ముఖ్యమంత్రి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలే తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని తెలిపారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలవడానికి వార్డుల అధ్యక్షులు, బూత్ లెవెల్ ఇన్‌చార్జిలు కృషి చయాలని పిలుపునించ్చారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, బీసీ విభాగం డైరెక్టర్ కేఆర్ పాత్రుడు, విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, బొండా శ్రీనివాసరావు, పతివాడ కనకరాజు, శ్రీనివాస్, వైదా నారాయణరావు, వరలక్ష్మి, బీజం పైడిరాజు, మొల్లి అప్పాలరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



19వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర శనివారం 62వ రోజుకు చేరుకుంది. 19వ వార్డులో అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. ఈ యాత్రలో భాగంగా ఎంవీవీ సత్యనారాయణ వార్డు ఇన్‌చార్జ్ సూరాడ వెంకటలక్ష్మితో కలిసి ఎంవీపీ కాలనీ సెక్టార్-12, లాసన్స్ బే కాలనీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త ఒరవడిని తీసుకొచ్చిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సాధ్యమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషిచేయాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



లబ్ధిదారుడి భార్యకు చెక్కు అందజేస్తున్న ఎంవీవీ



బాధితుడు తాలాడ శ్రీనుకు చెక్కు అందజేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: అనారోగ్యానికి గురైన పలువురు బాధితులు ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా...వారికి ఆర్థిక సాయం అందింది. ఈమేరకు బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ శనివారం ఉదయం చెక్కులను అందజేశారు. బ్రెయిన్ సర్జరీ చికిత్స చేయించుకున్న మురళీమోహన్ కృష్ణకుమార్‌కు సీఎం సహాయ నిధి చెక్కును ఆయన అందజేశారు. ఆయన లాసన్స్ బే కాలనీలోని క్యాంపు కార్యాలయంలో రోగి భార్యకు రూ.1.30 లక్షల చెక్కును అందజేశారు.

కిడ్నీ బాధితుడికి...

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి వివేకానందనగర్‌కు చెందిన తాలాడ శ్రీను కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధిని అర్థించాడు. దీంతో ఆయనకు సీఎం నిధి నుంచి ఆర్థిక సాయం మంజూరైంది. దీనికి సంబంధించిన రూ.75 వేలు చెక్కును శనివారం తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ బాధిత కుటుంబానికి అందజేశారు.

రూ.40 వేలు అందజేత

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో నివసిస్తున్న పీట్ల రవికుమార్ కొడుకు తేజ్ కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. రూ.40లను మంజూరైంది. బాధిత కుటుంబ సభ్యులకు వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీతాల గోవింద్ చెక్ అందజేశారు.

భక్తిశ్రద్ధలతో యల్లమ్మ తొలెళ్ల ఉత్సవం



పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెం యల్లమాంబ నగర్‌లో యల్లమ్మ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి మహిళలు ఆలయానికి వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర జాకెట్లు, గాజులు సమర్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు తొలి పూజ చేశారు. అనంతరం భక్తులు దర్శనం కల్పించారు. బుధవారం అమ్మవారి జాతర మహోత్సవాన్ని భాగంగా తెల్లవారు నుంచి పూజలు, సాయంత్రం అమ్మవారి తిరువీధి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు, పరస ఉత్సవ ఉంటుందని నిర్వహకులు తెలిపారు.

నేడు భువనేశ్వరికి అధివాసం

దాబాగార్డెన్స్ : శ్రీ భువనేశ్వరి ఆరాధన పీఠంలో అమ్మవారి విగ్రహానికి ఆదివారం రావిదళాలతో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్లు ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. ఈ మహోత్సవం మణిపురం చెల్లయ్యమ్మతోట యాతపాలెంలో గల ఆలయం వద్ద నిర్వహించనున్నట్లు చెప్పారు. అమ్మవారి ఆశీస్సులు పొందాలని భక్తులను కోరారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ప్రయాణించే రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. మిగిలిన రైళ్లు యథావిధిగా నడుస్తాయన్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మచిలీపట్నం-విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 2వ తేదీ నుంచి 29వ తేదీ తేదీ వరకు విశాఖ- మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విశాఖ -గుంటూరు -విశాఖ (22701/22702) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

పలు రైళ్ల దారి మళ్లింపు...

ఈ క్రింది రైళ్లు ఆయా తేదీల్లో నిడదవోలు-ఏలూరు- విజయవాడ మీదుగా కాకుండా మళ్లించబడిన మార్గంలో వయా నిడదవోలు-భీమవరంటౌన్-గుడివాడ-విజయవాడ మీదుగా ప్రయాణిస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. వచ్చే నెల 1,8,15,22వ తేదీల్లో ఎర్నాకుళం-పాట్నా (22643) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 3,5,10,12,17,19,24,26వ తేదీల్లో ఎస్ఎంవీ బెంగళూరు-గౌహతి (12509) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 1,3,5,6,8,10,12, 13,15, 17,19,20,22,24,26,27వ తేదీల్లో ముంబయి -భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్,

వచ్చే నెల 1వ తేదీ నుంచి 28తేదీ వరకు ధన్‌బాద్-అలెప్పీ(13351) బోకారో ఎక్స్‌ప్రెస్ , 4,11,18,25వ తేదీల్లో టాటానగర్ - యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్, 3,10,17,24వ తేదీల్లో జసిద్ది -తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్, 1,8,15,22వ తేదీల్లో హతియా- ఎర్నాకుళం (22837) ఏసీ ఎక్స్‌ప్రెస్, 6,13,20,27వ తేదీల్లో హతియా- ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్, 2,7,9,14,16,21,23,28వ తేదీల్లో హతియా- ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ , 5,12,19,26వ తేదీల్లో టాటానగర్ - ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

రాజ్యాంగాన్ని మార్చే యోచనలో బీజేపీ



మాట్లాడుతున్న ఆచార్య కె.ఎస్.చలం

సీతంపేట: చట్టం ముందు అందరూ సమానమేనని రాజ్యాంగంలో ఉందని, దీనిని బీజేపీ ప్రభుత్వం మార్చాలని చూస్తోందని, అందుచేత మనుధర్మాన్ని తగులబెట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని యూపీఎస్సీ పూర్వ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం రామాటాకీస్ రోడ్డులోని అంబేద్కర్ భవ అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. మనుధర్మ శాస్త్రానికి వ్యతిరేకంగా అందరికీ సమాన హక్కులను కల్పించిన రాజ్యాంగం అమలు జరిగితేనే మనుగడ సాధించగలమన్నారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తుందని హెచ్చరించారు. బీజేపీ పాలకులు నేడు మనువాదాన్ని దేశంలో అమలు చేస్తున్నారని, దానికి ఉదాహరణ పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకపోవడమేనన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజబాబు, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, సీపీఎం నాయకులు లోకనాథం, ఆర్పీఐ నాయకులు బి.కల్యాణరావు, శివప్రకాష్ పాల్గొన్నారు.

ఎటు చూసినా అభివృద్ధే



పూర్తయిన సీసీ రోడ్డు

- 22వ వార్డు అభివృద్ధి రూ.రూ.11.5 కోట్లు కేటాయింపు
- రూ.6.50 కోట్ల విలువగల పనులు పూర్తి
- అందుబాటులోకి వచ్చిన కూరగాయల మార్కెట్
- పార్కులు, క్రీడా స్థలాలతో కళకళ



పిఠాపురంకాలనీలో ఆధునికీకరించిన కూరగాయల మార్కెట్

మద్దిలపాలెం/బీచ్‌రోడ్డు : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తూర్పు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 22వ వార్డులో అంతగా అభివృద్ధి చెందలేదు. కార్పొరేషన్ ఎన్నికలు జరిగిన అనంతరం 22వ వార్డులో పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేపట్టింది. రోడ్లు, కాలువుల నిర్మాణం, గెడ్డలు ఆధునికీకరణ, రక్షణ గోడల నిర్మాణం, కల్వర్టుల నిర్మాణం, ప్రజలకు చేరువలో అర్బన్ హెల్త్ సెంటర్లు (యూపీహెచ్‌సీలు), సామాజిక భవనాలు నిర్మించి ప్రజల అవసరాలను తీర్చింది. దీంతో వార్డులో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వార్డు అభివృద్ధి పనులకు రూ.11.50 కోట్లు జీవీఎంసీ నిధులు కేటాయించింది. ఏ ప్రభుత్వమూ ఇన్ని నిధులతో అభివృద్ధి చేసిందిలేదు. వార్డు కార్పొరేటర్ వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి కాదు. అయినప్పటికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించి మతం చూడం..కులం చూడం..పార్టీ చూడం అని చెబుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వార్డు అభివృద్ధే ధ్యేయంగా పాలన నిధులు మంజూరు చేసింది. ప్రజలకు సదుపాయాలు కల్పించాలన్నదే అధికారి పార్టీ ఏకైక లక్ష్యమని భావించి జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి అత్యధిక నిధులు కేటాయించారు. స్థానికంగా ఉన్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అభ్యర్థన మేరకు అధిక శాతంలో నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశారు.

కూరగాయల మార్కెట్‌కు మహర్దశ

వార్డులో శిథిలమైన కూరగాయల మార్కెట్‌ను జీవీఎంసీ నిధుల రూ.17.50 లక్షలతో ఆధునికీకరణ చేశారు. రోడ్డు పక్కన వ్యాపారాల సాగించే చిరు వ్యాపారులకు మార్కెట్లో షాపులు కేటాయించారు. దీంతో సుమారు 70 మందికి షెల్టర్ ఏర్పడింది. దీంతో కళాభారతి ప్రధాన రహదారిపై ఇరువైపులు రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందులు తొలగాయి.

ప్రాథమికపాఠశాల ఆధునికీకరణ : రేవువాపువానిపాలెంలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆధునికీకరణకు రూ.1.50 కోట్లు ఖర్చు చేశారు. దీంతో కార్పొరేటర్ స్కూళ్లకు దీటుగా సకల సదుపాయాలతో పాఠశాలను తీర్చిదిద్దారు.

అందుబాటులోకి పట్టణ ఆరోగ్య కేంద్రం

వార్డులో కేటాయించిన పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి స్థలం సమస్య ఏర్పడడంతో దీనిని మారికవలసకు తరలించారు. అయితే వార్డులో ప్రజలకు వైద్య సేవలు దూరం కావడాన్ని గుర్తించి, ప్రస్తుతానికి అద్దె భవనంలో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

రెండు పార్కుల అభివృద్ధి

వార్డులో రెండు పార్కులు ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పిఠాపురంకాలనీలో ఈ పార్కులు ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి.

గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు

గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని పార్కులుగా తీర్చిదిద్దారు. దీంతో సేదతీరేందుకు సిమ్మెంట్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ప్రధాన గెడ్డకు ఆనుకుని ఖాళీ ప్రదేశాన్ని ఓపెన్ జిమ్‌గా అభివృద్ధి చేశారు. కాలనీలో ప్రధాన రోడ్డులను మరమ్మతులు చేశారు.

రోడ్లు, కాలువల అభివృద్ధి

వార్డులో రోడ్లు కాలువలతో పాటు శ్మశానవాటికలు, సామాజిక భవనాలు, నాడు-నేడులో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారు. కాలువల్లో పూడిక తొలగింపు, గెడ్డలకు రక్షణ గోడలు నిర్మాణం తదితర వాటిని అభివృద్ధి చేశారు.



తారు రోడ్డుల నిర్మాణం

వార్డులో విశేష అభివృద్ధి



జీవీఎంసీ 22 వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వార్డు రూపురేఖలు మారిపోయాయి. ఇంత వరకు రూ 11.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. గతంలో టీడీపీ పాలకులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోకుండా వదిలేశారు. భవిష్యత్‌లో ఈ వార్డును మరింత అభివృద్ధి చేస్తాం. పార్టీలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ఈ వార్డుకు ఎక్కువ నిధులు కేటాయించింది.

–పీతల గోవింద్, ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్, వార్డు అధ్యక్షుడు

ఐఐఎంవీలో ముగిసిన యంగ్ సైంటిస్ట్ ఇండక్షన్ ప్రొగ్రాం



ప్రసంగిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యంగ్ సైంటిస్ట్ ఇండక్షన్ ప్రోగ్రాం మూడు, నాల్గవ మాడ్యూల్స్ ముగిశాయి. శనివారం ముగింపు కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి ప్రసంగించారు. 46 మంది యువ శాస్త్రవేత్తలు ఆర్యభట్ట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్, రాజ రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ జినోమ్ రీసెర్చ్, డీఆర్‌డీవో, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ తదితర సంస్థల నుంచి హాజరయ్యారు.

వీరినుద్దేశించి ఏయూ వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ మానవ మేధోశక్తిని నేటి ఏఐ టెక్నాలజీ సవాళ్లను విసురుతోందన్నారు. ఆవిష్కరణ స్ఫూర్తిని రేకెత్తించడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ చైర్మన్ అదిల్ జైనులభి, ఐఐఎంవీ సంచాలకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్, కోర్సు కోఆర్డినేటర్ ఆచార్య పి.ఆర్.ఎస్ శర్మ తదితరులు ప్రసంగించారు.

అల్లు అర్జున్‌కు ఏయూ ఆహ్వానం



అల్లుఅర్జున్‌నుకు మొక్కను అందజేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రయూనివర్సిటీకి రావాలని సినీ నటుడు అల్లు అర్జున్‌ను వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి ఆహ్వానించారు. విశాఖలో షూటింగ్ నిమిత్తం వచ్చిన అల్లు అర్జున్‌ను ఓ హోటల్‌లో ప్రసాద రెడ్డి కలిశారు. ఇటీవల ఆధునికీకరించిన ఓపెన్ ఎయిర్ ఆడిటోరియాన్ని సందర్శించాలని, ఏయూ విద్యార్థులతో ముచ్చటించాలని కోరారు. ఏయూ సాధిస్తున్న ప్రగతిని అల్లు అర్జున్‌కు వివరించారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సత్యపద్మ



సత్యపద్మకు స్వాగతం పలుకుతున్న కార్యాలయ ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎం.సత్యపద్మ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఆమె ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఈడీ కార్యాలయం ఉద్యోగులు ఆహ్వానం పలికారు. అంతకుముందు సత్యపద్మ.. జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.